అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

## చౌకబియ్యం మింగుతున్న
# రేషన్ మాఫియా

- పేదల బియ్యం.. అక్రమాల సామ్రాజ్యం
- రామగుండం నుంచి మహారాష్ట్రకు అక్రమ రవాణా
- డీలర్ల నుంచి ప్రధాన దళారీ దాకా సూత్రధారులే...

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా లక్షల టన్నుల బియ్యం పంపిణీ చేస్తుంటే... రామగుండంలో మాత్రం మాఫియా పక్క దారి పట్టిస్తున్నది. పేదలకు పట్టెడన్నం పెట్టడానికి కరోనా విపత్తు నుంచి ప్రభుత్వం ఉచితంగా బియ్యం అందిస్తున్నది. ఇదే అదనుగా రేషన్ మాఫియా ఈ చౌక బియ్యాన్ని కొల్లగొడుతున్నది. గతంలో కంటే భిన్నంగా ఇప్పుడు డీలర్లు కొత్త దందాకు తెరలేపారు. రవాణా, పౌర సరఫరాలు, తూనికలు-కొలతలు, వాణిజ్య పన్నుల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇలా అన్ని శాఖల్లో కింది స్థాయి సిబ్బంది అక్రమార్కులకు సహకరించడంతో రేషన్ బియ్యం పక్క రాష్ట్రానికి యథేచ్ఛగా తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రామగుండం నుంచి సుందిళ్ల బ్యారేజీ మీదుగా మహారాష్ట్రకు టన్నుల కొద్ది బియ్యం తరలిపోతున్నది. లబ్ధిదారుల నుంచి తక్కువకు అక్రమార్కులు కొనుగోలు చేస్తూ వాటిని గుట్టుగా రీ సైక్లింగ్ చేసి ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రామగుండం కేంద్రంగా ఇటీవల ఈ దందా పెట్రేగిపోతున్నా అరికట్టడం ఎవరి వల్ల కావడం లేదంటే అతిశయోక్తి కాదు.

**పేదల బియ్యం..అక్రమార్కులకు ఆదాయం**

పేదల బియ్యం అక్రమార్కులకు ఆదాయంగా కలిసి వస్తున్నది. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్లలో దాదాపు 74 రేషన్ షాపులు ఉన్నాయి. మొత్తం 59వేల తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. ముందుగా డీలర్లు ఈ నెల మంచిగా రాలేదని లబ్ధిదారులను నమ్మిస్తూ వాటిని కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యం గోనె సంచుల్లోకి మార్చి మిల్లర్లు, మధ్య దళారులకు రూ.12 నుంచి రూ.16 మధ్య విక్రయిస్తున్నారు. తర్వాత వాటిని రీ సైక్లింగ్ చేసి గుట్టు చప్పుడు గాకుండా సుందిళ్ల బ్యారేజీ మీదుగా పౌనూరు, శివ్వారం అటవీ ప్రాంతం నుంచి చెన్నూరుకు తరలిస్తారు. అంతేగాక ఇతర ప్రాంతాల నుంచి యువకులను తీసుకవచ్చి వారిని ఇంటింటికి పంపింస్తూ రేషన్ బియ్యాన్ని దళారులు సేకరిస్తున్నారు. తర్వాత అక్కడి దళారీ వాటిని మహారాష్ట్రకు తరలించి అక్కడ కిలో రూ.30 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ మార్గమధ్యంలో అక్కడక్కడ నెలవారీ మామూళ్లతో పలువురి చేతులు తడపాల్సిందే. ఇంత పెద్ద దందా జరుగుతున్నా ఇప్పటివరకు ఒక్కరిపై కూడా క్రిమినల్ కేసు నమోదు కాలేదు. ఇలా ఒక్క రామగుండం నుంచే రేషన్ మాఫియా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తున్నది. అడపా దడపా పై అధికారులకు అనుమానాలు రాకుండా అప్పుడప్పుడు రేషన్ బియ్యం సరఫరా చేస్తుండగా కొద్ది మొత్తంలో పట్టుకొని సీజ్ చేస్తున్నారు. డీలర్ల నుంచి దళారీ వరకు నిఘాను తీవ్రతరం చేస్తే ఈ దందాను పూర్తిగా అరికట్టవచ్చు. ప్రతి నెలనెల కింది స్థాయి అధికారులకు మామూళ్లు సమయానికి అందడంతో ఈ దందా మాత్రం ఇప్పటికీ మూడు ఆటోలు..ఆరు బస్తాలుగా సాగుతున్నది.

ఇంటింటికి తిరిగి రేషన్ బియ్యం సేకరిస్తున్న యువకుడు

ఈ విషయమై జిల్లా సివిల్ సప్లై అధికారి రాజేందర్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రేషన్ దుకాణాలపై ప్రత్యేక బృందంతో నిఘా ఉంచామని వెల్లడించారు. గత రెండు నెలల్లో ఐదు దుకాణాలపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. ప్రజలు ధైర్యంగా ఫిర్యాదు చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని పేర్కొన్నారు.

# రూ. లక్షల్లో జీతాలు.. వందలకు కక్కుర్తి

- స్కావెంజర్ల జీతాల్లో కోతలు
- ప్రభుత్వ స్కూల్స్ ప్రధానోపాధ్యాయుల చేతివాటం

పెద్దపల్లి కమాన్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 2 : నెలకు రూ. లక్షకు పైగా వేతనాలు తీసుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్లో కొందరు రూ. వందల కోసం కక్కుర్తి పడుతున్నారు. స్కావెంజర్ల జీతాల్లో కోతలు పెడుతున్న వైనం జిలాల్లోని కొన్ని పాఠశాలల్లో జరిగినట్లు ఆలస్యంగా తెలిసింది.. అసలే నిరుపేదలు.. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలకు చెందిన కూలీలు కొన్ని నెలలుగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లుగా పని చేస్తున్నారు. వీరికి జీవో 21 ప్రకారం పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ (విద్యార్థుల సంఖ్య) ఆధారంగా జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన స్కావెంజర్ల జీతాలు రూ. 75లక్షలను గత నెల (జనవరి)లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఖాతాలో జమ చేసింది.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి జీతాలు ఇవ్వాల్సి ఉండగా, చాలా స్కూళ్లలో స్కావెంజర్లకు తమకు ఎంత జీతం వస్తుంనే విషయం తెలియదు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ప్రధానోపాధ్యాయులు ముందుగా ఒక నెలకు ఇంత జీతం ఇస్తామని ముందే మాట్లాడుకున్నారు. అయితే ఇటీవల మూడు నెలల జీతాలు విడుదల కాగా, ఇందులో టాయిలెట్స్ క్లీన్ చేసే రసాయలు, ఇతర ఖర్చులను చూపుతూ, పాఠశాలల సెలవు రోజులు, స్కావెంజర్లు రాని రోజులను ఇలా షరతులు పెడుతూ జీతాల్లో కోతలు పెడుతూ పలువురు ప్రధానోపాధ్యాయులు తమ కక్కుర్తి బుద్ధి చూపించారంటూ విమర్శలొస్తున్నాయి..

**513 స్కూళ్లకు రూ. 75 లక్షలు..**

జిల్లాలోని 513 ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్కావెంజర్లకు మూడు నెలలకు సంబంధించి రూ. 75 లక్షలు ఆయా పాఠశాలల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాల్లో జనవరి 16న జమ చేశారు. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన కొన్ని నెలలకు పాఠశాలలను శుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను బట్టి నియమించిన స్కావెంజర్లకు డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు) ద్వారా రూ. 75 లక్షలు విడుదల చేశారు. అయితే జీతాలు ఏ విధంగా ఇస్తారో తమకు వివరించి, మాకు రావాల్సిన మొత్తం డబ్బులను ఇప్పించాలని జిల్లా విద్యాశాఖాధికారులను స్కావెంజర్లు వేడుకుంటున్నారు. ఈ విషయమై పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి మాధవిని 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా, మూడు నెలలకు సంబంధించిన డబ్బులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఖాతాలో జమ చేశామని పేర్కొన్నారు. స్కావెంజర్లకు కోతలు విధిస్తూ జీతాలు ఇచ్చినట్లు ఇప్పటికీ మా దృష్టికి రాలేదు. జీతాలు సరిగ్గా ఇవ్వడం లేదని ఎవరైనా స్కావెంజర్లు ఫిర్యాదు చేస్తే, వెంటనే సంబంధిత హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

| విద్యార్థుల సంఖ్య | స్కావెంజర్ల జీతం |
|---|---|
| 1 నుంచి 30 | రూ. 3వేలు |
| 31 నుంచి 100 | రూ. 6వేలు |
| 101 నుంచి 250 | రూ. 8 వేలు |
| 251 నుంచి 500 | రూ. 12 వేలు |
| 501 నుంచి 750 | రూ. 15 వేలు |
| 750 పైన విద్యార్థులుంటే | రూ. 20 వేలు |

నరేశ్ నాయక్‌ను సన్మానిస్తున్న బంజార ఎంప్లాయిస్ సభ్యులు

## ఖోఖో జాతీయ స్థాయి సహాయ కోచ్‌కు సన్మానం

ధర్మారం,ఫిబ్రవరి2:ఇటీవల ప్రపంచ కప్ గెలిచిన మహిళల జాతీయ ఖోఖో జట్టు కోచ్ ఇస్లావత్ నరేశ్ నాయక్‌ను బంజేరుపల్లి తండా (బీ)లో బంజార ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన హైదరాబాద్ నుంచి రాగా, ఎంప్లాయిస్ సభ్యులు పత్తిపాక ఎక్స్ రోడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. బైక్‌ల ద్వారా తండా వరకు ర్యాలీగా తీసుకు వచ్చారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నరేష్ కోచ్‌గా వ్యవహరించటంతో మన దేశం ఆ క్రీడల్లో రెండు జట్లు విజయం సాధించడంతో నరేష్ నాయక్ ప్రపంచ గుర్తింపును సాధించారని వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో బంజార ఎంప్లాయిస్ అధ్యక్షుడు నున్సావత్ మోతీలాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి బదావత్ రాజు నాయక్,ఉపాధ్యక్షులు శంకర్ నాయక్, బానోత్ రాము నాయక్, కోశాధికారి ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్,సభ్యులు ప్రకాష్ నాయక్, ప్రవీణ్, రవి నాయక్,ఏఎంసీ చైర్మన్ లావుడ్యా రూప్లా నాయక్, పెద్దలు శంకర్ నాయక్, రాజు నాయక్, ఇస్లావత్ రాజునాయక్, నరహరి నాయక్ ఉన్నారు.

## క్రికెట్ విజేతలకు ట్రోఫీలు అందజేత

ఓదెల, ఫిబ్రవరి 2: ఓదెలలో జరిగిన రెండు మండలాల స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు ట్రోఫీలు, నగదు ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల స్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో పొత్కపల్లి జట్టు ప్రథమ స్థానంలో నిలిచి కప్‌తో పాటు రూ.10వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన ఓదెల జట్టు కప్, రూ. 5వేల నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. మూల ప్రేంసాగర్ రెడ్డి, బోడకుంట శంకర్ సొంత డబ్బులు అందించారు. కార్యక్రమంలో నాయకులు బైరి రవిగౌడ్, తిరుపతిరెడ్డి, సిరిసేటి రాహుల్, ముంజాల మధు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచన స్ఫూర్తితో ముందుకు సాగాలి

కమాన్‌పూర్, ఫిబ్రవరి 2: అంబేద్కర్ ఆలోచన విధానం, ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని వక్తలు కోరారు. కమాన్‌పూర్ బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆలయ ఫౌండేషన్, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూలే, అంబేద్కర్ జ్ఞాన మాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు బొంకూరి మధు, జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపెల్లి బాపయ్య, ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేశ్ బాబు, కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు అంబటి కనకయ్య, వివిధ పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## అ'పూర్వ' సమ్మేళనం

కమాన్‌పూర్, ఫిబ్రవరి 2: జూలపల్లిలోని మూర్తి విద్యాలయం 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు అదే పాఠశాల ఆవరణలో 26 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

## పుట్టిన రోజున 100 మొక్కలు నాటి..

మొక్కలు నాటుతున్న అనిల్-అనూష దంపతులు

ఓదెల, ఫిబ్రవరి 2: ఓదెల గ్రామానికి చెందిన చిన్నారి దిడ్డిగి రుద్రాన్స్ మొదటి సంవత్సర పుట్టిన రోజును పురస్కరించుకుని వారి తల్లిదండ్రులు అనిల్- అనూష ఆదివారం 100 మొక్కలు నాటారు. గుండ్లకుంట వద్ద గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. ఇందుకు గ్రామస్తులు వారిని అభినందించారు. కార్యక్రమం ఇతరులకు స్ఫూర్తిదాయకంగా ఉందని పలువురు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, కుమారస్వామి, ఇప్పనపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

ధర్మారం,ఫిబ్రవరి2: బీఆర్ఎస్ మండల ఉపాధ్యాక్షుడు గాజుల రాజును మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆదివారం రాజు తల్లి అనారోగ్యంతో మరణించింది. కొప్పుల ఈశ్వర్ బాధితుడి ఇంటికి వెళ్లి రాజు,అతని సోదరుడిని పరామర్శించి ఓదార్చారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాసూరి శ్రీధర్,సీనియర్ నేత పూస్కూరు జితేందర్‌రావు, పూస్కూరు రామారావు,కాంపెల్లి చంద్రశేఖర్,కూరపాటి శ్రీనివాస్,ఆవుల శ్రీనివాస్, వేణు, నళినీకాంత్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల శిక్షణకు దరఖాస్తులు

జ్యోతినగర్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీపడుతున్న నిరుద్యోగ యువతకు ఎన్టీపీసీ సీఎస్ఆర్, ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి ఆధ్వర్యంలో చేపట్టనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 3 నుంచి 6 వరకు స్థానిక సాయిసేవా సమితి ప్రాంగణంలోని ఎన్టీపీసీ లైఫ్ స్కిల్డ్ అకాడమీలో నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. వివరాలకు 7780197368, 7981367855, 8106044670 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

## ప్రొఫెసర్ సిరాజొద్దీన్‌కు సన్మానం

పెద్దపల్లి కమాన్, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మహ్మద్ సిరాజొద్దీన్ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏజీపీ ఉప్పు రాజు ఆధ్వర్యంలో సిరాజొద్దీన్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. సిరాజొద్దీన్ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 'లిఎన్హాన్సింగ్ సెక్యూరిటీ ఇన్ వైర్లెస్ సెన్సార్ నెట్‌వర్క్ త్రూ మలేషియాస్ ఫ్రీ డేలా ఫార్వార్డింగ్ స్టార్ట్ జిలి' అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. కార్యక్రమంలో భవనం సుబ్బారెడ్డి, నాగుల ఓదెలు, ఉప్పు రాంచందర్, గౌసుద్దీన్, ఎండీ. ఆరిఫ్, సయ్యద్ ఆరిఫ్, అసిఫ్, సయ్యద్, ఖాలిద్, సలీ మొద్దీన్, అఫ్జల్ పాషా, ఉదయ్, యాదగిరి, కట్ట మనోహర్, ఎండీ. జావిద్ అలీ, ఇంతియాజ్, జావిద్, జహీర్, సమీర్, తాళ్ల కల్యాణ్ పాల్గొన్నారు.

## సీఐటీయూ బస్తీబాట

గోదావరిఖని, ఫిబ్రవరి 2: సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక గాంధీనగర్‌లో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) బస్తీబాట చేపట్టింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి కార్మిక కుటుంబ సభ్యులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంత కాలంగా ఆర్వో ప్లాంటు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు పలు సమస్యలు వివరించారు. ఇక్కడ యూనియన్ నాయకులు ఆరెపల్లి రాజమౌళి, ఆసరి మహేశ్, వేణుగోపాల్‌రెడ్డి, జెల్ల గజేందర్, జంగాపల్లి మల్లేశ్, దాసరి సురేశ్, జలగం సత్యనారాయణ, నంది నారాయణ, తిప్పారపు రాజు, మహేందర్, తదితరులు ఉన్నారు.

## నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: గోదావరిఖని వినోబా నగర్‌కు చెందిన నిరుపేద యువతి వివాహానికి వీహెచ్ఆర్ ఫౌండేషన్ చేయూత అందించింది. నిరుపేద కుటుంబానికి చెందిన యువతి వివాహాని కి సాయం చేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వ్యాళ్ల హరీష్ రెడ్డిని కోరగా ఆయన స్పందించారు. తన ఫౌండేషన్ రామగుండం టీం ద్వారా యువతి కుటుంబ సభ్యులకు ఆదివారం రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులకు యువతి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 28వ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర కార్యదర్శిగా శారద

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి3: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర మహిళా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కూనారం గ్రామానికి చెందిన సిరిపురం శారదను నియమించినట్లు ఆ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు శారద కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల వ్యతిరేక బడ్జెట్

గోదావరిఖని/కోల్‌సిటీ, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా, పేదల వ్యతిరేక బడ్జెట్ అని ఫైట్‌ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. కేంద్రం ఈ బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి ద్రోహం చేసిందని విమర్శించారు. తెలుగు కవి గురజాడ అప్పారావు వాఖ్యాలతో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ తెలుగు రాష్ట్రం తెలంగాణను మాత్రం పట్టించుకోలేదని పేర్కొన్నారు

కవి జయరాజ్‌ను సన్మానిస్తున్న క్లబ్ ఆర్‌సీ చైర్మన్ రాజేందర్

## ప్లాస్టిక్ నిషేధానికి సమష్టిగా కృషి చేయాలి

ధర్మారం,ఫిబ్రవరి2: ప్లాస్టిక్ నిషేధానికి లయన్స్ క్లబ్ సభ్యులంతా సమష్టిగా కృషి చేయాలని ప్రజాకవి,గాయకుడు గొడిసెల జయరాజ్ కోరారు. బొమ్మారెడ్డిపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాలులో క్లబ్ ఆర్‌సీ తన్నీర్ రాజేందర్, ధరణి మహిళ క్లబ్ ప్రధాన కార్యదర్శి తన్నీర్ పద్మ ఆధ్వర్యంలో ఆదివారం క్లబ్ రీజినల్ మీట్ నిర్వహించారు. సమావేశానికి ఉమ్మడి కరీంనగర్,ఆదిలాబాద్ జిల్లాలోని 13 క్లబ్‌ల సభ్యులు హాజరయ్యారు. ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తామని క్లబ్ సభ్యులతో జయరాజ్ ప్రమాణం చేయించారు. ఎంతో మందికి శస్త్ర చికిత్సలు చేయించి ఆర్‌సీ చైర్మన్ రాజేందర్‌ను అభినందించారు. జయరాజ్‌తో పాటు క్లబ్ సీనియర్ సభ్యులను రాజేందర్ సన్మానించారు. రాజేందర్-పద్మ దంపతులను గజమాలతో సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ మల్టీపుల్ చైర్మన్ అనుమండ్ల రాజిరెడ్డి, కెనోట్ చైర్మన్ చీర్ల సురేశ్, వీసీ గవర్నర్లు సింహరాజు కోదండ రాములు, మోర భద్రేశం, ప్రోగ్రాం చైర్మన్ సామ ఎల్లారెడ్డి, జడ్‌సీలు డాక్టర్ శ్రీనివాస్,బాపు రెడ్డి, డాక్టర్ రామకృష్ణ,ప్రొగ్రాం కో చైర్మన్ గడ్డం లింగారెడ్డి, పుచ్చకాయల మునీందర్, ఇప్ప మల్లేశం,ధర్మారం క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్ శెట్టి,కార్యదర్శి అబ్దుల్ ముజాయిద్,కోశాధికారి కట్ట రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారుల ర్యాలీ

కాల్వశ్రీరాంపూర్ : ర్యాలీలో పాల్గొన్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి2: ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు వెయ్యి గొంతుకల బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ కాల్వశ్రీరాంపూర్‌లో డప్పు కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ కాలనీ నుంచి డప్పు చప్పుళ్లు, పాటలతో ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. ఇక్కడ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, కళామండలి నిర్వాహకులు రామంచ భరత్,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, నాయకులు బర్ల తిరుపతి, తూండ్ల రాజయ్య, ఉమా మహేశ్వర్, సిరికొండ కొమురయ్య, అజయ్, మొగిళి తిరుపతి, మారుపాక మల్లయ్య, మాస్టిన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దంతన పెల్లి స్వామి, మంథని రామస్వామి, తూండ్ల రామస్వామి, ఇనుగాల రాములు, తదితరులు ఉన్నారు.

జ్యోతినగర్, ఫిబ్రవరి 2: ఎస్సీ వర్గీకరణను తెలంగాణ ప్రభుత్వం అమోదించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న హైదరాబాద్‌లో తలపెట్టిన వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల సాంస్కృతిక మహా ప్రదర్శనకు మద్దతుగా ఆదివారం ఎన్టీపీసీ పట్టణ పరిధి ఐదో డివిజన్‌లో ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు చిలుముల రవి, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు చిలుముల ఓదెలు మాదిగ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. డివిజన్‌లోని నర్రశాలపల్లిలో డప్పు చప్పుళ్లతో వాడ వాడ తిరుగుతూ వెయ్యి గొంతుకలు లక్ష డప్పుల మహా ప్రదర్శనకు అధిక సఖ్యలో తరలిరావాలని డప్పులతో చాటింపు చేశారు. ఎమ్మార్పీఎస్ రామగుండం కార్పొరేషన్ ఇన్‌చార్జి రేణుకుంట్ల సాగర్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 2 : హైదరాబాద్‌లో ఈ నెల 7న నిర్వహిస్తున్న 'వెయ్య గొంతుకలు-లక్ష డప్పులు' నిరసన ప్రదర్శణ విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. జూలపల్లిలో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డప్పు చప్పుళ్లతో ర్యాలీ తీశారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ అమలు చేస్తామని ప్రకటించి ఎందుకు కట్టుబడి లేరని ప్రశ్నించారు. నాయకులు ఇరుగురాల శ్రీనివాస్, కలెపెల్లి నర్సింగం, ఇరుగురాల సర్వతాలు, నర్సయ్య, మధునయ్య, ఇరుగురాల వెంకటి, నారాయణ, పోచం, తిరుపతి పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్,ఫిబ్రవరి 2: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పులు -వేల గొంతుల వాల్ పోస్టర్‌ను ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకుడు థామస్ సుల్తానాబాద్‌లో ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, శంకర్, చంద్రమౌళి, నాంపల్లి, సంపత్, రాహూల్, మానిణ్ బాయ్, రాములు, అంజయ్య, చంద్రయ్య, కొమురయ్య ఉన్నారు.

## వైద్యానికి చేయూత

జూలపల్లి, ఫిబ్రవరి 2 : జూలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మహ్మద్ దస్తగిరి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ తనవంతు సాయం చేయడానికి ముందుకు వచ్చారు. ఆదివారం దస్తగిరిని కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో వైద్యం చేయించుకోడానికి 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున రూ. 5 వేలు అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. ఇక్కడ ఏఎంసీ మాజీ చైర్మన్ పాటకుల అనిల్, నాయకులు పొలవేని సతీశ్, అంకూస్, మేర శ్రీనివాస్, మెండె మల్లేశం, వంగపెల్లి వెంకటరమణ, ఐల రాజయ్య, పాటకుల మహేశ్, చింతమల్ల వీరయ్య, అమురాజి శంకర్ తదితరులు ఉన్నారు.

## బల్దియా కమిషనర్‌కు సత్కారం

కోల్‌సిటీ, ఫిబ్రవరి 2ః రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ), స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీని పద్మశాలీ సంఘం, శివాలయం ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. రాబోయే శివరాత్రి సందర్భంగా మార్కండేయ కాలనీలోని శివాలయం రోడ్డు నామకరణంతోపాటు స్వాగత తోరణం ఏర్పాటు చేయాలని కోరారు. శివరాత్రి ఉత్సవాలకు ఆమె ను ఆహ్వానించారు. కార్యక్రమంలో పోపా అధ్యక్షులు వడ్డె పల్లి దినేష్, సంఘం నాయకులు రాజమల్లు, బూర్ల దామో దర్, మంచికట్ల భిక్షపతి, సతీశ్, వేణు, మహిళా సంఘం సభ్యులు మాటేటి మౌనిక, లలిత శ్రీ, కనకలక్ష్మీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## విహార యాత్రకు విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్, ఫిబ్రవరి 2: బొంతకుంటపల్లి, ఐతరాజ్‌పల్లి, చిన్నబొంకూర్‌లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌కు విద్యా వైజ్ఞానిక విహార యాత్రకు వెళ్లారు. దాదాపు 50 మంది విద్యార్థులు తరలివెళ్లారు. చార్మినార్, గోల్కొండ కోట, సాలారంగ్ మ్